www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 9 డిసెంబర్ 2023

5

ఏలూరు



12న జిల్లాకు గవర్నర్..!

'వికసిత్ భారత్'లో పాల్గొనే అవకాశం

దెందులూరు: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో పాల్గొనేందుకు ఈ నెల 12న గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ జిల్లాకు వస్తున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా గవర్నర్ కార్యక్రమానికి మండలంలోని గాలాయగూడెం పంచాయతీ వేదిక కానుంది. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా జిల్లా పంచాయతీ అధికారి, దెందులూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాస విశ్వనాథ్ స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులతో సమీక్షించి పలుసూచనలు చేశారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై స్టాల్స్ ఏర్పాటు చేయాలని, లబ్ధిదారులతో మాట్లాడించాలని, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని కోరారు. డ్రోన్ ప్రదర్శన, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వివిధ శాఖల వారీగా పనివిభజన చేశారు.

ఖరీఫ్ మాసూళ్లు ఎప్పటికీ పూర్తయ్యేనో.. దాళ్వా నారుమడులు పూర్తయ్యేదెప్పుడో.. ఇంకా పొలాల్లో ఉన్న 60 శాతం పంట గట్టెక్కేదెప్పుడో.. నాట్లు ఆలస్యమైతే దాళ్వా సాగు సాగేనా.. ఇలా రైతులను అనేక ప్రశ్నలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మిచౌంగ్ తుపాను దెబ్బకు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తడిసిన ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకుండా వ్యవహరిస్తున్న తీరు దాళ్వాసాగుపై తీవ్ర ప్రభావం చూపనుండటంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తడిసిన ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



చింతలపూడి మండలంలో వర్షానికి తడిసిపోయిన ధాన్యం (ఫైల్‌ఫొటో)

ధాన్యం కొనరు.. దాళ్వా సాగదు..!

- ప్రభుత్వ తీరుతో రబీ సాగుకు ఎదురుదెబ్బ
- తడిసిన ధాన్యం కొనుగోలు చేయని పరిస్థితి
- ఆరబెట్టేందుకు రోజులు తరబడి రైతుల అగచాట్లు
- దాళ్వా నారుమడులపై తీవ్ర ప్రభావం
- పలుచోట్ల వేసిన నారుమడులు జలమయం
- నెలాఖరుకు నారుమడుల పూర్తి కష్టమే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

దాళ్వా సాగుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న జిల్లా రైతాంగం ఆశలను మిచౌంగ్ తుపాను తుడిచేసింది. ఖరీఫ్ పంట మాసూళ్లు పూర్తిచేసి దాళ్వా నారుమడులు వేసేందుకు తీవ్ర ఆలస్యమయ్యే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఇటు ఖరీఫ్ పంట పోయే.. అటు దాళ్వా పంట ఏమవుతుందో తెలియని పరిస్థితిలో అన్నదాత కొట్టుమిట్టాడుతున్నాడు. తడిసిన ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వ స్పష్టమైన ఆదేశాలు జారీ చేయలేదు. దీంతో రైతులు తడిసిన ధాన్యం ఆరబెట్టడంలోనే రోజులు గడిచిపోతున్నాయి. దీంతో రబీ నారుమడులపై వృష్టి పొంచి పరిస్థితి లేకుండాపోయింది. రెండు జిల్లాలవ్యాప్తంగా ఖరీఫ్‌లో నాలుగు లక్షల ఎకరాల్లో వరిసాగు సాగింది. ఏలూరు జిల్లాలో 45 శాతం మాసూళ్లు పూర్తవ్వగా, పశ్చిమగోదావరి జిల్లాలో 35 శాతం మాసూళ్లు మాత్రమే పూర్తయ్యాయి. సరాసరిన 40 శాతం మాసూళ్లు పూర్తవ్వగా, దాదాపు 2.50 లక్షల ఎకరాల్లో పంటంతా పొలాల్లోనే ఉంది. మిచౌంగ్ తుపాను భీభత్సంతో రైతుల బతుకులు అల్లకల్లోలంగా మారాయి. తుపాను ప్రభావంతో రెండు రోజులపాటు ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షంతో పొలాల్లో మోకాళ్ల లోతుకుపైగా వరదనీరు నిలిచిపోయింది. దీంతో మాసూలు చేసిన రాశులన్నీ నీట మునిగాయి. కోత కోయాల్సిన పొలాలు నేలకొరిగి నీటిలో నాని కుళ్లిపోతున్న పరిస్థితి నెలకొంది. రబీలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 4.60 లక్షల ఎకరాల్లో సాగు చేసేందుకు జిల్లా సాగునీటి సలహామండలి సమావేశంలో నిర్ణయించారు. సకాలంలో రబీ నాట్లు పూర్తి కావాలంటే డిసెంబర్ 15వ తేదీకి రబీ నారుమడులు పూర్తి చేయాలని తెలిపారు. ఇప్పట్లో రైతులు నారుమడులు వేసే పరిస్థితి లేకుండాపోయింది. అందుకు ప్రధాన కారణం ప్రభుత్వమేనని చెప్పాలి. తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తే రైతులు నారుమడుల కోసం ఖరీఫ్ మాసూళ్లు పూర్తి చేసేందుకు అవకాశం ఉండేది. ప్రభుత్వం మాత్రం మాటలకే పరిమితమైంది. రైతులను వంచిస్తోంది. పొలాల్లో నీరు తగ్గి ఖరీఫ్ మాసూళ్లు పూర్తి చేయాలంటే మరో 20 రోజులకుపైగా సమయం పట్టే పరిస్థితి ఉంది. అంటే డిసెంబర్ నెలాఖరుకు కూడా నారుమడులు పూర్తయ్యే అవకాశం కన్పించడం లేదు. నిడమర్రు, ఉంగుటూరు వంటి పలు మండలాల్లో కౌలిదారులు ఆనుకుని ఉన్న పొలాలకు రైతులు నారుమడులు వేశారు. తుపాను దెబ్బకు పెద్దఎత్తున నీరు నిలిచిపోవడంతో నారుమడులు పనికిరాకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత పరిస్థితి చూస్తే దాళ్వా నాట్లు ఫిబ్రవరి వరకూ పూర్తయ్యే పరిస్థితి కన్పించడం లేదు. అదే జరిగితే సాగునీటి సమస్య ఎదుర్కొనాల్సి ఉంటుందని చెప్పలేని పరిస్థితి. ఇది రబీ పంటపై తీవ్ర ప్రభావం చూపనుంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. దీంతో ఇటు ఖరీఫ్, అటు రబీలోనూ రైతులు నష్టాలు పాలైతే అప్పుల ఊబిలో కూరుకుపోతారు. ఖరీఫ్ మాసూళ్లు త్వరగా పూర్తికావాలంటే ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో నిబంధనలు సడలించాలి. అయితే ప్రభుత్వం అటువైపు ఏమాత్రం ఆలోచించని పరిస్థితి.

తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తేనే సకాలంలో దాళ్వా సాగు

వర్షాలకు తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామంటూ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఎక్కడా జరగడం లేదు. అందుకు సంబంధించి ఎటువంటి ఆదేశాలను ప్రభుత్వం విడుదల చేయలేదు. తేమ శాతానికి సొమ్ము కటింగ్ చేసే విధానమే కొనసాగుతోంది. దీంతో తడిసిన ధాన్యం రోడ్లపైనే దర్శనమిస్తోంది. కళ్ల మీద ఉన్న పొలాలు మాసూళ్లు త్వరగా పూర్తి కావాలంటే ధాన్యం కొనుగోలులో తేమశాతం నిబంధన సడలించి తడిసిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాల్సి ఉంది. అప్పుడు వేగంగా ఖరీఫ్ మాసూళ్లు పూర్తయ్యి దాళ్వా నారుమడులు వేసేందుకు రైతులకు అవకాశం ఉంటుంది. ఇదేవిధంగా ప్రభుత్వం వ్యవహరిస్తే దాళ్వా సాగులోనూ రైతులకు ఇబ్బందులు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మార్చి వరకూ ఖరీఫ్ ధాన్యం కొనుగోలు

- నిబంధనల్లేకుండా తడిసిన ధాన్యం సేకరణ
- రైతులు ఆందోళన చెందొద్దు
- దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా
- పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్ కుమార్

ప్రజాశక్తి - పెదపాడు

రాష్ట్రంలో ఖరీఫ్ ధాన్యాన్ని వచ్చే ఏడాది మార్చి నెల వరకూ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రైతులు ఈ విషయంలో ఎలాంటి ఆందోళన చెందొద్దని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ తెలిపారు. పెదపాడు మండలం కొక్కిరపాడు, వట్లూరు, రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలును, సీతారామపురంలో దెబ్బతిన్న పంటలను శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ తుపాన్ కారణంగా రైతులకు ఎలాంటి నష్టమూ వాటిల్లకుండా చూడటమే రాష్ట్రప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. రాష్ట్రంలోని రైతులు కోరిక మేరకు వారి వద్ద ఉన్న ధాన్యం మొత్తం కొనుగోలు చేసేవరకు వచ్చే ఏడాది మార్చి నెల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరచి ఉంచుతామన్నారు. గత రబీలో అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్రవ్యాప్తంగా ముందస్తుగా నవంబర్‌లో ప్రారంభించామన్నారు. వీటిని మార్చి వరకు రైతులు కోరారని, ఇందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం లక్ష్యంగా నిర్ణయించామని, అయినప్పటికీ ఎంత మేర ధాన్యం వచ్చినా సేకరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రెండు రోజుల నుండి రాష్ట్రవ్యాప్తంగా 1.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు చేశామన్నారు. నవంబరు చివరిలో తుపాన్ హెచ్చరిక నేపథ్యంలో ముందుగానే ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని చెప్పారు. కోత కోసిన ధాన్యాన్ని రైతుల కల్లాల నుండి నేరుగా ఆఫ్ లైన్ విధానంలో రైస్ మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు. వర్షాల కారణంగా పంట తడవకుండా ఉండేందుకు టార్పాలిన్లు అందించామన్నారు. తేమశాతంలో రైతులకు ఇబ్బంది పెట్టొద్దన్నారు. ఏదో రేటుకు దళారులకు తమ ధాన్యాన్ని రైతులు అమ్ముకోవద్దని, వారి వద్ద ధాన్యం మొత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతుల పట్ల సానుకూలంగా ఉండాలని అధికారులను ఆదేశించామన్నారు. కోతకు వచ్చిన పంటలో మొలకలు వచ్చిన ధాన్యం కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి తీసుకోవాల్సి ఉందని, ఇందుకోసం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారితో టెస్ట్ మిల్లింగ్ చేసి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. రంగుమారిన ధాన్యం, నూకశాతంపై రైతులకు, మిల్లర్లకు నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పంట నష్టాలపై మూడు రోజుల్లో సర్వే పూర్తి చేస్తామని, పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తామని, కోత కోయని పంట నష్టపోయిన వారికి పంటల బీమా కింద పరిహారం అందిస్తామని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందొద్దని అరుణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. జెసి బి.లావణ్యవేణి మాట్లాడుతూ జిల్లాలో రూ.లక్ష 67 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. ఇంతవరకు 1.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. గత రెండు రోజులుగా తుపాన్ వలన జిల్లాలో ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, దెందులూరు, పెదపాడు మండలాల్లో ధాన్యం అధికంగా సాగు చేస్తారన్నారు. గురువారం నాటికి 800 మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించాల్సి ఉండగా, వాటిని కూడా శుక్రవారం తరలించామన్నారు. చింతలపూడి మండలం ప్రగడవరంలోని రైతు తుపాన్ మూలంగా తన ధాన్యం తడిచి 28 శాతం తేమ కారణంగా మొలకెత్తిందని, దానిని కొనుగోలు చేయాలని కోరాని, దీనిపై సిఎం జగన్ ఆదేశాల మేరకు, తడిసిన మొలకెత్తిన ధాన్యాన్ని మిల్లర్ల ద్వారా కొనుగోలు చేసి సొమ్ము చెల్లించామని, దీనికి సంబంధించి రైతు ఆనందం వ్యక్తం చేశారన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి ఆర్.సత్యనారాయణ రాజు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి వై.రామకృష్ణ, ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, పౌర సరఫరా సంస్థ జిల్లా మేనేజర్ మంజుభార్గవి, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు అక్కి నరేష్ చౌదరి, తహశీల్దార్ విజయకుమార్, పౌర సరఫరాలు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పెదవేగి : మండలంలో తుపాన్‌కు దెబ్బతిన్న పంటలను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ పరిశీలించారు. అమ్మపాలెం, పెదకడిమి గ్రామాల్లో నీటిపాలైన వరి పంటలను, కల్లాల్లోని తడిసిన ధాన్యం రాశులను పరిశీలించారు. తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు దిగులు పడొద్దని భరోసా ఇచ్చారు.



పెదవేగి : తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న అరుణ్‌కుమార్

ధాన్యం ఆరాక కొంటాం

తల్లాపురంలో రైతుకు అధికారులు భరోసా

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ధాన్యం కొంచెం ఆరిన వెంటనే కైకలూరులోని బాయిల్డ్ మిల్లులకు పంపేందుకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తల్లాపురంలోని కేతా రామారావు అనే రైతుకు ఉంగుటూరు తహశీల్దార్ ఎ.వి.రమణారావు శుక్రవారం భరోసా ఇచ్చారు. ఈనెల ఎనిమిదో తేదీన 'ప్రభుత్వ మాటలన్నీ నీటిమూటలే' అంటూ 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తహశీల్దార్ రమణారావు, మండల వ్యవసాయాధికారి బి.వెంకటేశ్వర్లుతోపాటు పలువురు అధికారులు శుక్రవారం తల్లాపురం గ్రామం వెళ్లి రైతు రామారావు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం మరికొంచెం ఆరిన తర్వాత కొనుగోలు చేస్తామని రైతుకు హామీ ఇచ్చారు. రైతులవద్ద ఉన్న ప్రతిగింజను ప్రభుత్వం తరఫున కొనుగోలు చేస్తామని, ఆద్రైన్యపడొద్దని తహశీల్దార్ తెలిపారు. ఉంగుటూరు మండలంలో ఆర్‌బికెల ద్వారా ఇప్పటివరకూ 13,478.8 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. దీనిలో 597.6 క్వింటాళ్లు, కైకరం-1లో 5,346.2 క్వింటాళ్లు, కైకరం-2లో 7,535 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు.

14, 15 తేదీల్లో ఆశాల వంటావార్పు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 14, 15 తేదీల్లో కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న వంటావార్పు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక బంటావీలిపేట పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వి.సాయిబాబు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే అధికారుల వేధింపులు ఆపాలన్నారు. ఆశా వర్కర్లతో ఆన్‌లైన్ వర్క్, రికార్డ్ వర్క్ రెండు రకాల పనులు చేయిస్తున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, ప్రభుత్వ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశాల సమస్యలు పరిష్కరించకపోతే రానున్న కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా చేపడుతున్న వంటావార్పు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ ఏలూరు నగర అధ్యక్షురాలు విజయ మాట్లాడుతూ ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాధరావు, ఆశా వర్కర్లు కె.రేణుక, కె.సావిత్రి, వి.విజయకుమారి, ఎం.సత్యవతి, ఎన్.సుభాషిణి, టి.బేబీసరోజని, కె.కనకదుర్గ పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల రక్తదానం

ఏలూరు అర్బన్: స్థానిక నరసింహారావుపేట హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఉద్యోగులు శుక్రవారం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 25 మంది బ్యాంకు ఉద్యోగులు రక్తదానం చేసినట్లు జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి, రిటైర్డ్ తహశీల్దార్ కెబి.సీతారాం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెరిగినప్పటికీ, కొంత మంది మాత్రమే రక్తదానం చేస్తున్నారన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరూ రక్తదానంపై అపోహలు వీడాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు క్లస్టర్ హెడ్ విజయసారథి, రెడ్ క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం, వరప్రసాదరావు, బ్రాంచి మేనేజర్లు సత్య, అయినాల శ్రీనివాసరావు, నలమాటి, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

ప్రతిగింజనూ కొనుగోలు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - భీమడోలు

తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ప్రతి ధాన్యంగింజను కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు కోరారు. శుక్రవారం కౌలు రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా పూళ్ల గ్రామంలో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం రాశులను పరిశీలించారు. ఆయా రైతుల సమస్యలను అడిగితెలుసుకున్నారు. అనంతరం లింగరాజు మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రోడ్లపైకి తరలించిన రైతులకు ఎకరాకు రూ.పదివేల వరకూ అదనంగా ఖర్చయిందని తెలిపారు. ఈ మొత్తాన్ని ప్రభుత్వం రైతుకు చెల్లించాలని కోరారు. తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులను గుర్తించి ఎకరాకు రూ.పదివేలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఇదే క్రమంలో 25 శాతం వరకూ తడిసిన ధాన్యాన్ని ఏ విధమైన షరతుల్లేకుండా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కానీ వాస్తవ పరిస్థితుల్లో మిల్లర్లు 20 శాతం వరకూ తేమతో కూడిన తడిసిన ధాన్యాన్ని తీసుకుంటామంటున్నారన్నారు. ఇదే క్రమంలో ఒక్కో ధాన్యంబస్తాకు ఐదు నుంచి పది కేజీల వరకు కోత విధించి ధరను నిర్ణయిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌలురైతు సంఘం భీమడోలు శాఖ నాయకులు వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, మానుకొండ వీర్రాజు పాల్గొన్నారు.



భీమడోలు : వర్షానికి తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న లింగరాజు

నష్టపరిహారమందించాలని సబ్ కలెక్టర్‌కు వినతి

నూజివీడు రూరల్ : మిచౌంగ్ తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం తక్షణం పరిహారం అందించి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ పంటలు కోల్పోయిన రైతులను ఆదుకుంటేనే ముమ్మందు సాగు చేయగలరన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రామకృష్ణ పాల్గొన్నారు.



నూజివీడు రూరల్ : నేలకొరిగిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ఉద్యోగులను విస్మరిస్తే పతనం తప్పదు : సాబ్జీ

నేటి నుంచి యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించని పక్షంలో రాబోయే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వ ఓటమి తప్పదని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ హెచ్చరించారు. ఈనెల తొమ్మిది, పది తేదీల్లో యుటిఎఫ్ 49వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఏలూరులో జరగనున్న నేపథ్యంలో శుక్రవారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశాల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ రాష్ట్రంలోని యుటిఎఫ్ 26 జిల్లాల ప్రతినిధులు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ సమావేశానికి హాజరై భవిష్యత్ కర్తవ్యాలు చర్చిస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్యా సంస్కరణల వల్ల విద్యార్థుల డ్రాపవుట్స్ పెరుగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం నుండి ఉద్యోగులకు ఇవ్వాల్సిన డిఎ, పిఆర్‌సి ఎరియర్స్, సరెండర్ లీవుల ఎగవేత, పిఎఫ్ రుణాలు, ఎపిజిఎల్ఐ రుణాఉల, గ్రాడ్యుటీ తదితర రూ.20 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉందంటే దానికి కారణం ఆర్థిక అరాచకత్వమేనని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం వెనక్కి తీసుకోవాలని, శాస్త్రీయ విద్యావిధానం అమలు చేయాలని ఆయన కోరారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చిన సిఎం జగన్ దానికంటే ప్రమాదకరమైన జిపిఎస్ తీసుకొచ్చి ఉద్యోగుల నోట్లో మట్టికొట్టారని, దీనికోసం రానున్న రోజుల్లో పోరాటం చేస్తామని ఆయన అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పాత పెన్షన్ విధానం ఇస్తామన్న ప్రభుత్వాలే అధికారంలోకి వచ్చాయని, కేవలం రెండు శాతం ఓట్ల తేడాతో తెలంగాణలో ప్రభుత్వం మారిందని, జగన్ మోహన్ రెడ్డి ఉద్యోగుల విషయంలో తన పద్ధతి మార్చుకోకపోతే ఈ రాష్ట్రంలో కూడా రానున్న ఎన్నికల్లో అదే జరుగుతుందని ఆయన హెచ్చరించారు. స్థానిక మినీ బైపాస్‌రోడ్‌లోని చలసాని గార్డెన్స్‌లో తొమ్మిది, పది తేదీల్లో జరిగే యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి కుమార్‌రాజా, బి.సుభాషిణి, ఏలూరు జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తఫా అలీ, ప్రధాన కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు

జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ



దెందులూరు : రైతులకు నష్టం కలగకుండా ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ తెలిపారు. మండలంలోని పోతునూరు, దోసపాడు గ్రామాల్లో శుక్రవారం రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం రాశులను అధికారులతో కలిసి పరిశీలించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. రైతుల నుండి ధాన్యాన్ని ఆంక్షలు లేకుండా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, ఈ విషయంలో రైతులు ఆందోళనకు గురికావొద్దన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా వ్యవసాయ, పౌరసరఫరాల, రెవెన్యూ శాఖలు టీములుగా ఏర్పడి తడిసిన ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నారని, రైతులందరూ ఆందోళన చెందొద్దన్నారు. రైతులకు సిఎం జగన్ అండగా ఉంటారని తెలిపారు. ఆమెవెంట వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు గంటా ప్రసాదరావు, అధికారులు పాల్గొన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మిచౌంగ్ తుపాను నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం అన్నే భవనంలో తుపాను వల్ల రైతులకు జరిగిన నష్టాలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వివిధ పంటలకు జరిగిన నష్టాలపై రైతు సంఘం బృందాలు పర్యటించాయని చెప్పారు. చేతికొచ్చిన పంటలు దెబ్బతిని అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి, మొక్కజొన్న, పత్తి, పొగాకు, అరటి, కూరగాయలు, మిర్చి, మినుము తదితర పంటలకు తీవ్ర నష్టంవాటిల్లిందన్నారు. ప్రభుత్వం పంట నష్టాల నమోదు ఆలస్యం చేయడం తగదన్నారు. 35శాతం పైగా నష్టం జరిగితేనే నమోదు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం దుర్మార్గమన్నారు. ఎన్యూమరేషన్ నిబంధనలు సవరించి పంట ఏ మేరకు నష్టం జరిగినా నమోదు చేసి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆహార పంటలకు ఎకరాకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. తడిసిన, రంగు మారిన, మొలకెత్తిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకోవాలని కోరారు. తుపాన్ హెచ్చరికలున్నా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టకపోవడం వల్ల కల్లాల్లో ధాన్యం తడిసిపోయిందన్నారు. ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించి యుద్ధప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం : ఎలిజా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మిచౌంగ్ తుపాన్ వల్ల నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని చింతలపూడి ఎంఎల్ఎ ఎలిజా పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుపాన్ వల్ల నియోజకవర్గంలో అనేక రకాల పంటలు నాశనమయ్యాయని చెప్పారు. వేలాది మంది రైతులకు తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందించాలని సిఎం జగన్‌ను కోరామని తెలిపారు. చింతలపూడి నియోజకవర్గంలో 5299 ఎకరాల్లో వరి, 620 ఎకరాల్లో వేరుశనగ, 1200 ఎకరాల్లో పొగాకు, 299 ఎకరాల్లో పత్తి, 1630 ఎకరాల్లో మొక్క జొన్న పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారన్నారు. ఈ క్రమంలో నాలుగు మండలాల్లో నష్టపోయిన రైతులను పరామర్శించినట్లు చెప్పారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేసేలా మంత్రి కారుమూరితో మాట్లాడినట్లు తెలిపారు. తుపాన్ ప్రభావంతో నష్టపోయిన రైతుల ఇబ్బందులను చూసి ఈనెల తొమ్మిదో తేదీన జరగనున్న తన పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు తెలిపారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు నష్టపోయిన రైతులకు అండగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, వైసిపి పట్టణ అధ్యక్షులు అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహనుండాలి

ఏలూరు: వస్తువుల కొనుగోలులో వినియోగదారులు నష్టపోతే కమిషన్‌లో ఫిర్యాదు చేసి న్యాయం పొందొచ్చని సీనియర్ న్యాయవాది రామానుజాచార్యులు సూచించారు. కొవ్వలి వినియోగదారుల సేవామండలి ఆధ్వర్యంలో స్థానిక సుబ్బమ్మదేవి హైస్కూల్లో వినియోగదారుల హక్కులు - బాధ్యతలు, వినియోగదారుల చట్టం-2019పై జివిడి.మల్లేష్‌కుమార్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామానుజాచార్యులు మాట్లాడుతూ విద్యార్థిస్థాయి నుండి వస్తు కొనుగోలు వ్యవహారాల్లో అవగాహన కలిగి ఉండాలన్నారు. వస్తువు కొనుగోలు సందర్భంలో నష్టపోతే వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేసి వస్తు సేవల ధరలు తిరిగిపొందొవచ్చని, అలాగే నష్టపరిహారం కూడా చెల్లిస్తారని వివరించారు. అనంతరం వినియోగదారుల హక్కులను కాపాడాలంటూ, మోసపూరిత ప్రకటనలు అరికట్టాలంటూ, అంతర్జాల మోసాలను నివారించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది, కొవ్వలి వినియోగదారుల సేవా మండలి ప్రెసిడెంట్ కట్టా సత్యనారాయణ, ఉపాధ్యాయులు టి.ప్రకాష్, వినియోగదారుల ఉద్యమ ప్రతినిధులు, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

23, 24 తేదీల్లో బాలోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు

హేలాపురి బాలోత్సవం ఈనెల 23, 24 తేదీలకు వాయిదా వేసినట్లు ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు టీచర్ ఎంఎల్‌సి షేక్ సాబ్జి, అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, నిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావులు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. మూడు రోజులుగా కురిసిన వర్షాలు, విద్యాలయాలకు సెలవులు, పరీక్షల వాయిదాల కారణంగా హేలాపురి బాలోత్సవం నాలుగో పిల్లల సంబరాలను ఈనెల 16, 17 తేదీలకు బదులుగా ఈనెల 23, 24 తేదీలలో నిర్వహించాలని ఆహ్వాన సంఘం కమిటీ నిర్ణయించిందని తెలిపారు.

భీమడోలు : హేలాపురి బాలోత్సవం-నాలుగు కార్యక్రమం వాయిదా పడినట్లు స్వచ్ఛంద సంస్థ మానవత జిల్లా సమన్వయకర్త రామిశెట్టి గంగాధర రావు తెలిపారు. వాస్తవానికి కార్యక్రమాలు ఈనెల 16, 17 తేదీల్లో జరగవలసి ఉంది. కానీ వానలు, విద్యాసంస్థలకు సెలవులు, పరీక్షల వాయిదాల నేపథ్యంలో ఆహ్వాన కమిటీ సూచన మేరకు కార్యక్రమం ఈనెల 23, 24వ తేదీల్లో నిర్వహించనున్నారన్నారు. ఇదే క్రమంలో బాలోత్సవాల్లో పాల్గొనేందుకు దరఖాస్తులు స్వీకరించే గడువును ఈనెల 8వ తేదీ నుంచి 16వ తేదీకి పొడిగించారని తెలిపారు. బాలోత్సవాల ఆహ్వాన కమిటీ సూచనల మేరకు ఈ విషయాన్ని భీమడోలు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు, ఇతరులకు ముందస్తుగా తెలియజేశామని మానవత జిల్లా కో ఆర్డినేటర్ తెలిపారు.

నష్టపరిహారం రూ.20 వేలు ఇవ్వాలి : సిపిఐ

కొయ్యలగూడెం: మిచౌంగ్ తుపాను కారణంగా మొక్కజొన్న, పొగాకు తోటలు, ఇతర వ్యవసాయ ఆధారిత పంటలకు ఎకరాకు రూ.20 వేల చొప్పున పంట నష్టం చెల్లించాలని సిపిఐ మండల కార్యదర్శి రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయినప్పుడు అరకొర కేటాయించిన నిధులు కూడా రైతులకు అందడం లేదు, తక్షణమే ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

కళింగ సంఘం అభివృద్ధికి పాటుపడతా

ఉంగుటూరు: నారాయణపురం కళింగ సంఘం అభివృద్ధికి తన శక్తి వంచన లేకుండా పాటు పడతానని సంఘం అధ్యక్షులు గురువెల్లి రాజారావు తెలిపారు. నారాయణపురం కళింగ సంఘం సమావేశం గురువారం రాత్రి గురువెల్లి ప్రసాద్ అధ్యక్షతన లయన్స్ క్లబ్‌లో నిర్వహించారు. సంఘం అభివృద్ధికి, సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సంఘం ప్రెసిడెంట్‌గా గురువెల్లి రాజారావు, వైస్ ప్రెసిడెంట్‌గా బొమ్మిడి అనిల్ కుమార్, సెక్రెటరీగా అరివెల్లి ధనయ్య, కోశాధికారిగా బొమ్మిడి బాలకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పివి.సత్యనారాయణలను సభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీకి గౌరవాధ్యక్షులుగా సీపాని పెద్దిరాజు, సువ్వారి పెద్దిరాజు, తిర్లంగి పోలయ్య, బ్యాంకు ఖాతా లావాదేవీల నిమిత్తం గురువెల్లి రాంబాబు, సీపాని శివ బాలు, పైడి వరప్రసాద్‌లను నియమించారు. అధిక సంఖ్యలో గ్రామ కళింగ కులస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా కిట్లు పంపిణీ

జీలుగుమిల్లి : రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 15 నుంచి జరిగే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల కిట్లు శుక్రవారం పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ కెఆర్ఎస్.కృష్ణ ప్రసాద్ తెలిపారు. మండల వ్యాప్తంగా 11 సచివాలయలకు గాను క్రికెట్, కోకో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలకు సంబంధించి కిట్లను ఎంపిపి కొర్స పోసమ్మ, జెడ్‌పిటిసి వసంతరావు చేతుల మీదుగా పంచాయతీ సెక్రెటరీలకు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారిణి మంగతాయారు పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలో త్వరలో జరగనున్న ఆడదాం ఆంధ్ర క్రీడా పోటీలకు సంబంధించి క్రీడా కిట్లను శుక్రవారం ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ పంపిణీ చేశారు. ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని గ్రామ సచివాలయ కార్యదర్శులకు క్రీడా కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శీలం రామకృష్ణ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : ఇటీవల రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలలో పాల్గొన్న తాడువాయి హైస్కూల్ విద్యార్థులకు దాతలు క్రీడా దుస్తులు అందజేశారు. శుక్రవారం తాడువాయి ప్రభుత్వ హైస్కూల్ క్రీడాకారులు టి.శంకర శ్రీనివాస్ గుప్తా, యరమళ్ల జాన్‌లకు పాపోలు సుబ్బారావు జ్ఞాపకార్థం వారి భార్య ఈశ్వరమ్మ కుమారులు రామ్మోహనరావు, రామాంజనేయులు క్రీడాకారులకు బహూకరించారు.

నూజివీడులో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

నూజివీడు రూరల్ : పట్టణంలోని ఆరవ వార్డులో ఎంఎల్‌ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఎంఎల్‌ఎ ఇంటింటికి పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాల వలన కలిగిన లబ్ధిని వివరించారు. పథకాలలోని సమస్యలను పరిష్కరించాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహాసభ

ఏలూరు అర్బన్ : ఈనెల 10వ తేదిన విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో జరిగే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ఏపి జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్ కె.రమేష్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ భవనంలో నిర్వహించిన ప్రాథమిక సమావేశంలో రమేష్ కుమార్ మాట్లాడుతూ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు వారి పక్షాన ఏపి జెఎసి అమరావతి అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపి జెఎసి అవుట్‌సోర్సింగ్ ఛైర్మన్ పి.కిషోర్ కుమార్, జనరల్ సెక్రటరీ కె.నాగ భూషణం, వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ పాల్గొన్నారు.

వాడవల్లిలో 'వై ఎపి నీడ్స్ జగన్'

ముదినేపల్లి : రాష్ట్రానికి జగనన్నే మరలా సిఎం కావాలని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని వాడవల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో డిఎస్ఆర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

లారీ బోల్తా : ఇద్దరికి గాయాలు

జీలుగుమిల్లి : లారీ అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలైన ఘటన దర్భగూడెం సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం భోపాల్ నుంచి దేవరపల్లికి కోళ్ల మేతతో వస్తున్న లారీ దర్భగూడెం సమీపంలోకి వచ్చేసరికి డ్రైవర్ ఆదమరుపుతో అదుపు తప్పి జాతీయ రహదారి పక్కనే దూసుకుపోయి పక్కనే వున్న పామాయిల్ తోటలో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో లారీలో ఉన్న రాజస్థాన్‌కు చెందిన లాల్ చంద్, బబ్లూ అనే ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్ఐ వి.చంద్ర శేఖర్ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల వివరాలు సేకరించారు. అనంతరం 108 వాహనం రావడం లేట్ అయ్యేసరికి క్షతగాత్రులను హుటాహుటిన పోలీస్ జీపులో ఎక్కించి మెరుగైన చికిత్స నిమిత్తం జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు తెలిపారు.

ఫైనాన్స్ సంస్థలో దోపిడీకి యత్నం

నూజివీడు రూరల్ : పట్టణంలోని ఫిన్ కేర్ స్మాల్ ఫైనాన్స్ సంస్థలో గురువారం అర్ధరాత్రి దుండగుడు దోపిడీకి ప్రయత్నించాడు. షట్టర్ తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించి, బలంగా తలుపును తాకగా ఒక్కసారిగా అల్లారం మోగడంతో మాస్కు ధరించి ఉన్న దుండగుడు పారిపోయాడు. ఈ దుండగుడే ఈనెల 5వ తేదిన ముత్తూట్ ఫైనాన్స్‌లో తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడని తెలుస్తుంది. సమాచారం అందుకున్న జిల్లా సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ శుక్రవారం నూజివీడు విచ్చేసి, సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ ఫుటేజీని పరిశీలించిన అనంతరం రెండు చోట్ల ప్రయత్నించిన దుండగుడిని పట్టుకునేందుకు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ : వ్యక్తులకు గాయాలు

మండవల్లి : ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీకొని ఒక వ్యక్తికి కాలు విరగ్గా, ఇరువురికి స్వల్ప గాయాలైన సంఘటన రుద్రవరం వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం మండవల్లి గ్రామానికి చెందిన గుడివాడ రాజేంద్ర, ఆంజనేయులు తాపీ పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా రుద్రవరం వద్దకు వచ్చేసరికి ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తి ఆంజనేయులు, రాజేంద్ర వస్తున్న వాహనాన్ని బలంగా ఢీ కొట్టాడు. ఈ సంఘటనలో రాజేంద్ర, ఆంజనేయులు పక్కనే ఉన్న కాలువలో పడిపోవడంతో రాజేంద్ర కుడి కాలు విరిగిపోయి తీవ్ర రక్తస్రావం అయ్యింది. ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు రాజేంద్రను, ఆంజనేయులును 108 సహాయంతో వైద్య నిమిత్తం గుడివాడ తరలించారు. మరో వ్యక్తిని వైద్యనిమిత్తం కైకలూరు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన పరిస్థితిని పరిశీలించారు.



వర్షపు నీటిలో నడుచుకుంటూ వెళ్తున్న చిన్నారులు..



పాఠశాల చుట్టూ చేరిన వర్షపు నీరు

వాన నీటిలో బడి.. చదువులెలా..?

ప్రజాశక్తి - చింతలపూడి

వర్షం వస్తే పాఠశాల ప్రాంగణం మొత్తం వర్షం నీటితో నిండిపోతుంది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే మోకాళ్ల వరకు వరద నీటితో ఇబ్బందులు పడుతూ.. తరగతి గదిలోకి వెళ్లవల్సిన పరిస్థితి నెలకొంది. ఇది చింతలపూడిలోని ప్రాథమిక పాఠశాల పరిస్థితి.. చింతలపూడి మండలంలోని ఆంథోని నగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలను వరద నీరు ముంచెత్తింది. తరగతి గదులు, వరండాలు ఇలా బడి ప్రాంగణమంతా వర్షపు నీరు చేరి బురదమయమైంది. వాన నీటితో విద్యార్థులు, టీచర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్లుగా పాఠశాల దుస్థితి ఇలానే ఉన్నా.. కనీసం మరమ్మతులు చేయట్లేదని స్థానికులు చెబుతున్నారు. నాడు - నేడు అంటూ ఆర్భాటంగా ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రికి విద్యార్థుల కష్టాలు కనపడవా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు..

ప్రాథమిక పాఠశాలలో వర్షం వస్తే చాలు పాఠశాల ప్రాంగణం మొత్తం వర్షపు నీటితో నిండిపోతుంది. విద్యార్థులు తరగతి గదిలోకి వెళ్లాలంటే, ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చినప్పుడు వరదలో విషసర్పాలు కూడా సంచారిస్తున్నాయని, అయినా ఎవరూ పట్టించుకోవటం లేదని వాపోతున్నారు. గతంలో అనేక మార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమస్యను చెప్పినా పాఠశాల ప్రాంగణంలో గ్రావెల్ మట్టి వేసి నీరు నిల్వ లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. చెప్పి సంవత్సరాలు గడుస్తున్నా.. నేటికీ ఇదే పరిస్థితి నెలకొంది. వర్షం వచ్చిందంటే చాలు విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి తోడు వరద నీరు తగ్గినా బురదతో పాటు దోమలతో నానా ఇబ్బందులు పడుతున్నారు. సమస్యల పరిష్కారానికి లక్షల్లో ఖర్చు అవుతుందని పాఠశాల సమస్యను గాలికొదిలేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిపెట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తాం

ఎంఇఒ, కిరణ్ బాబు

జిల్లా అధికారుల దృష్టిలో సమస్యను గురించి తెలియజేశాం. త్వరితగతిన సమస్యను పరిష్కరించటానికి కృషి చేస్తాం.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రైతులెవ్వరూ అధైర్య పడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని పాలచర్ల రాజవరం, జీలుగుమిల్లి రెవెన్యూ పరిధిలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్రాల్లో పర్యటిస్తూ దెబ్బతిన్న పొగాకు, వేరుశనగ, వరి పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.



జీలుగుమిల్లి:దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ బాలరాజు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎవరూ అధైర్య పడవద్దని, ప్రతి రైతుకి అండగా ఉంటామని అన్నారు. దెబ్బ తిన్న పంటల వివరాలను నమోదు చేయాలని అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొర్స పోసమ్మ, జెడ్‌పిటిసి వసంతరావు, సొసైటీ అధ్యక్షులు బోధ శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు సంద ప్రసాద్, తహశీల్దార్ సుందర్‌సింగ్ పాల్గొన్నారు.

టి.నరసాపురం : తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం అండగా వుంటుందని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు అన్నారు. మండల కేంద్రమైన టి.నరసాపురంలో మిచౌంగ్ తుపానుకు దెబ్బతిన్న వేరుశనగ పంటను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి మాట్లాడుతూ మండలంలో అధికారులు బృందాలుగా ఏర్పడి పంటనష్టం అంచనా వేస్తున్నారని ఆయన తెలిపారు. పంట నష్టపోయిన రైతులు స్థానికంగా వున్న రైతుభరోసా కేంద్రాలలో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి.లక్ష్మి వెంకటేశ్వరరావు, వ్యవసాయాధికారి డి.ముత్యాల రావు, నిరీక్షణ రావు, కన్నం సర్వేశ్వర రావు, నల్లూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముసునూరు: తుపాను ప్రభావంతో నష్టపోయిన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వటానికి అంగీకరించినట్లు మండల వ్యవసాయ అధికారి ఎస్.మధు మోహన్ తెలిపారు. శుక్రవారం ఆయన వరి పంటలను పరిశీలించి, ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్తి, చెరుకు, మిరప, కూరగాయ పంటలకు ఎకరాకు రూ.17 వేలు, మొక్కజొన్న పంటకు హెక్టార్ రూ.12,500, పొగాకు, వరి తదితర పంటలకు హెక్టార్‌కు రూ.10 వేల నష్టపరిహారం ఇవ్వటానికి ఆమోదించినట్లు తెలుపుతూ, మండలంలోని రైతులు శని, ఆదివారాల్లో ఆర్‌బికె కేంద్రాల్లో నష్టపోయిన రైతులు తమ వివరాలను తెలుపుతూ నమోదు చేయించుకోవాలని, అదేవిధంగా తహశీల్దార్, ఎంపిడిఒ, విఆర్ఒ, వ్యవసాయ, ఉద్యానవన అధికారులు పరిశీలించి పంట నష్టపరిహారం వచ్చేలా చర్యలు చేపడతారని తెలియజేశారు.

ముదినేపల్లి : మండలంలోని కాకరవాడలో తుపాను ప్రభావంతో నీట మునిగిన పంట పొలాలను శుక్రవారం ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ వైసిపి నాయకులతో కలిసి పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ పంట నష్టపోయిన ప్రతి రైతుకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శీలం రామకృష్ణ, గ్రామ సర్పంచి కాగిత రామారావు పాల్గొన్నారు.

స్త్రీ, పురుషులను సమానంగా చూడాలి

మండవల్లి : స్త్రీ, పురుషులు వేరు వేరు కాదని, సమాజంలో ఇద్దరి విలువ ఒక్కటేనని ప్రతిఒక్కరు గమనించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎపిఎం రాజశ్రీ తెలిపారు. జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న జాతీయ కార్యక్రమాన్ని స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 22 వరకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా స్త్రీ, పురుషులు ఇరువురు ఒక్కటేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటరమణ, తహశీల్దార్ రాజ్ కుమార్, ఇఒపిఆర్‌డి ఆనంద్ బాబు, హౌసింగ్ ఎఇ వివిఎస్ శేఖర్ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'ను వినియోగించుకోవాలి


టి.నరసాపురం: యువత ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్య నారాయణ రాజు(సూరిబాబు) అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా కిట్లు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేస్తున్న ఈ ప్రయత్నం సఫలీకృతం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతాల్లో ఉన్న యువకుల ప్రతిభ ఈ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా బయట పడతోందన్నారు. మండలంలోని యువకులు అందరూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి.లక్ష్మి వెంకటేశ్వరరావు, సర్పంచి మోదుగు సునంద, ఎంపిటిసి నార్లపాటి వెంకటేశ్వరరావు, పంచాయతీ విస్తరణ అధికారి బి.రాం ప్రసాద్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

నూజివీడు రూరల్ : ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పని భారం తగ్గించాలని సిఐటియు మండల కార్యదర్శి జి.రాజు తెలిపారు. ఈనెల 14, 15 తేదీల్లో కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో పాల్గొంటున్నామని నూజివీడు పట్టణ ఆశా వర్కర్లు పిహెచ్‌సి డాక్టర్‌కి వినతిని అందించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ రూ.10 లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు ఆశా వర్కర్లకు వర్తింపచేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ నాయకులు నాగమణి పాల్గొన్నారు.

గండి కొట్టి పంటను కాపాడుకోవాలి

ప్రజాశక్తి - మండవల్లి



రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తల బృందం

పొలాల్లోని వర్షపు నీటిని గండ్లు కొట్టి తొలగించుకుని పంటను కాపాడుకోవచ్చునని ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ సుజాత, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.ఫణికుమార్ తెలిపారు. మండలంలోని కానుకొల్లు, లింగాల, పెరికే గూడెం గ్రామాలలో మిచౌంగ్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను శుక్రవారం శాస్త్రవేత్తల బృందం పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వెంటనే పొలంలో నిలబడి ఉన్న నీటిని బయటకు తోడే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వీలైనన్ని చోట్ల వీలైనన్ని గండ్లు కొట్టి వర్షపు నీటిని బయటకు తోడివేసేయాలన్నారు. అంతేకాకుండా నిలబడి ఉన్న పొలాల్లో అయిదు శాతం ఉప్పు ద్రావణాన్ని అనగా ఒక లీటర్ నీటికి 50 గ్రాముల కల్లుప్పు కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే పడిపోయిన, పనల మీద ఉన్న వరి పొలంలో 25 కేజీల కల్లుప్పు చల్లాలన్నారు. కంకులు ఉన్న దుబ్బులను పైకి లేపి నిలబెట్టి కట్టుకోవాలని తెలిపారు. ధాన్యాన్ని వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లులకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎం.చాముండేశ్వరి, ఎడిఎ వెంకటమణి పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని ఎ.పోలవరంలో ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలు చెల్లించి, వారి సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు యాగంటి సీత డిమాండ్ చేశారు. శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎ.పోలవరం గ్రామ సచివాలయం కార్యదర్శి పద్మశ్రీకి ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సీత మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గత సంవత్సరం ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు కూలీలు పని చేస్తున్నారు కానీ చేసిన పనికి పే స్లిప్పులు ఇవ్వటంలో మండల ఎపిఒ ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుమార్లు పనిచేసినా, డబ్బులు ఇవ్వాలని, పనులు కల్పించాలని దరఖాస్తులు పెట్టినప్పటికీ కూలీలకు అరకొర పనులు కల్పించి ఆరు రోజులు పని చేస్తే నాలుగు రోజులకే డబ్బులు ఇస్తున్నారని మండిపడ్డారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని పైఅధికారులకు దరఖాస్తు పెడితే పనికిరాని కూలీలతో సంతకాలు చేయిస్తున్నారనే నెపంతో పెట్టిన దరఖాస్తును రద్దు చేస్తున్నారని వాపోయారు. తక్షణమే మండల ఎంపిడిఒ జోక్యం చేసుకొని మాకు రావాల్సిన వేతన ఇప్పించాలని కోరారు. లేని పక్షంలో గ్రామంలోని ఉపాధి హామీ కూలీలను ఐక్యం చేసి మండల ఎంపిడిఒ ఆఫీస్ ముట్టడిస్తామని ఉపాధి హామీ అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దొమ్మేటి వెంకటేశ్వరరావు, తోనం సోమలమ్మ, ఆర్.సత్యవతి, జి.సూర్యకిరణ్, నాగరాజు పాల్గొన్నారు.

కౌలురైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

మండవల్లి : పంట నష్టపరిహారాన్ని ప్రభుత్వం వెంటనే చెల్లించి, కౌలురైతు కుటుంబాన్ని ఆదుకోవాలని టిడిపి నాయకులు కొడాలి వినోద్ కోరారు. మిచౌంగ్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షానికి పంట నీట మునగడంతో మనస్తాపానికి చెందిన కౌలు రైతు మృతి చెందాడనే సమాచారంతో ఆయన శుక్రవారం పెరిగేగూడెం చేరుకుని మృతదేహాన్ని సందర్శించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం పండించిన పంట తుపాను ప్రభావంతో నీళ్ల పాలైందనే మనస్తాపంతో జయరాజు మృతి చెందడం బాధాకరమన్నారు. జయరాజు కుటుంబాన్ని ప్రభుత్వ ఆదుకోవాలని తెలిపారు.

అవినీతి నిరోధానికి యువత పాటు పడాలి

ఆగిరిపల్లి : అవినీతిని నిరోధించడంలో యువత క్రియాశీలక పాత్ర పోషించాలని, మనహక్కులకై పోరాడు-సాధించు ఉద్యమ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, నూజివీడు డివిజన్ ఎస్‌సి, ఎస్‌టి, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు అయ్యంకి సురేష్‌బాబు కోరారు. ఈనెల 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగిరిపల్లి జూనియర్ కాలేజీ విద్యార్థులకు అవినీతి అదుపుదలపై-భారతీయ చట్టాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కె.యోహన్, సయ్యద్ లాల్ సాహెబ్, పి.రవి, ఎం.శ్రీనివాస్, ఎస్.కోటేశ్వరరావు, ఎల్.ఎంకోజి, సిహెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

మండవల్లి : అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో వర్షపు నీటిని తొలగించే విధంగా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టామని కానుకొల్లు సర్పంచి నాగదాసి థామస్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిచౌంగ్ తుపాను ప్రభావంతో నాలుగు రోజుల పాటు విస్తారమైన వర్షాలు కురిసాయన్నారు. దీంతో కానుకొల్లు గ్రామంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయన్నారు. వర్షపు నీటి వల్ల గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా, నీటిని తొలగించే విధంగా శుక్రవారం జెసిపితో కచ్చా డ్రెయిన్లు తవ్వించే విధంగా పనులు నిర్వహించామని ఆయన తెలిపారు. అనంతరం దోమలు వ్యాప్తి చెందకుండా పూర్తిస్థాయిలో బ్లీచింగ్, సున్నం చెల్లించామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు పుట్టి సత్యనారాయణ, ఉపసర్పంచి కుందేటి నాగేశ్వరరావు, కార్యదర్శి రత్నకుమారి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులు ఓటు నమోదు చేసుకోవాలి

చింతలపూడి : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని చింతలపూడి తహశీల్దార్ కృష్ణ జ్యోతి అన్నారు. పట్టణంలో శశి పాఠశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం పాఠశాల ప్రిన్సిపల్ జినుగు రాజా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వినూత్నంగా ఓటు ఆకారంలో నిల్చుని చూపరులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.మురళీ కృష్ణ పాల్గొన్నారు.

రుణ సౌకర్యాలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - చాట్రాయి

గ్రామీణ, పట్టణ ప్రజలకు సహకార కేంద్ర బ్యాంక్ అందిస్తున్న వివిధ రకాల రుణ సౌకర్యాలు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, పొదుపు ఖాతా తెరవాలని, పొదుపు ఖాతా కలిగి ఉండడం వలన అనేక లాభాలు పొందవచ్చని శుక్రవారం కీర్తన కల్చరల్ సొసైటీ కళాజాత బృందం నరసింహారావు పాలెం, గుడిపాడు, పిట్టలవారి గూడెం గ్రామాల్లో కళాజాత పాటలు, నాటికల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

సేవా గుణం ఉండాలి

టి.నరసాపురం : సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి వుండాలని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టి.నరసాపురం గ్రామానికి చెందిన సయ్యద్ నాసర్ పాషా ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన 400 బోజనం ప్లేట్లను విద్యార్థులకు శుక్రవారం సూరిబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో ఎంపిపి డి.లక్ష్మి, కె.కుటుంబరావు పాల్గొన్నారు.

డ్రెయిన్ మరమ్మతులు ప్రారంభం

కలిదిండి : మండలంలోని కోరుకొల్లు నుంచి ఉప్పుటేరుకు కలిసే లాల్వా డ్రెయిన్ పూడికతీత పనులను కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు ప్రారంభించారు. జెసిబి సాయంతో మద్దవానిగూడెం వద్ద గుర్రపుడెక్క, కిక్కిస తొలగింపు పనులను చేపట్టారు. ముంపుకు గురైన వరి పొలాలు, లోతట్టు ప్రాంతాలలోని నీటి పారుదలకు లాల్వా డ్రెయిన్ ప్రదానమైనందున యుద్ధప్రాతిపదికన మరమత్తు పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

ఉంగుటూరు : తుపాను ప్రభావిత వరదలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురంధేశ్వరి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె నియోజకవర్గంలో ముంపు గ్రామాల్లో పర్యటించారు. తడిచిన ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎకరానికి నష్టపరిహారం రూ.50 వేలు ఇవ్వాలని కోరారు.

యుద్ధ ప్రాతిపదికన వర్షపు నీరు తొలగింపు చర్యలు

పోలవరం : కొత్త పట్టిసీమ పంట చేలలో ఉన్న వర్షపు నీటిని తొలగించేందుకు సర్పంచి మైగాపుల విజయ దుర్గ, మైగాపుల దుర్గాప్రసాద్ ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం పనులు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ఎంఎల్‌ఎ, ఐటిడిఎ పిఒ ఇచ్చిన ఆదేశాల మేరకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించారన్నారు. కొవ్వాడ కాలువ గట్టుకి రాచగట్టు సమీపంలో గండి కొట్టి పంట చేలలో ఉన్న జలాలు బయటకు పోయేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

వంగవీటి రంగా విగ్రహావిష్కరణ

కొయ్యలగూడెం: మండలంలో వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా వంగవీటి రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆకర్షించదగ్గ విషయమన్నారు. కాపుల సంక్షేమం కోసం వంగవీటి మోహన్ రంగ ఎంతో కృషి చేశారని తెలిపారు.